క్లుప్తంగా

ఘనంగా బోనాల పండుగ



నెక్కొండ : మండల కేంద్రంలోని సెయింట్ థెరిసా హైస్కూల్‌లో శుక్రవారం ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థులు బోనాలు, పోతురాజుల విన్యాసాలతో అలరించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ చల్లా మమత మాట్లాడారు. విద్యార్థులకు బోనాల పండుగ ప్రత్యేకత, సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను వివరించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ చల్లా యాకూబ్‌రెడ్డి, ఉపాధ్యాయులు రమేశ్, ఎం.దేవేందర్, వి.శ్రీకాంత్, లావణ్య, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రూట్ సర్వే



వర్ధన్నపేట : మండలంలోని నల్లబెల్లిలో ఆర్టీసీ అధికారులు శుక్రవారం రూట్ సర్వే నిర్వహించారు. గ్రామం నుంచి ఉన్న రవాణా సౌకర్యాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వరంగల్ నుంచి అన్నారం ప్రయాణించే ఆర్టీసీ బస్సును నల్లబెల్లి మీదుగా నడిపించాలని గ్రామస్తులు అధికారులను కోరారు. సర్వే నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులు ప్రజలకు మరింత మెరుగైన రవాణా సౌకర్యం కల్పించనున్నట్టు అధికారులు తెలిపారు.

వర్షానికి కూలిన గోడ



ఖానాపురం : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని మనుబోతులగడ్డకు చెందిన కృష్ణ ఇంటి గోడ కూలిపోయింది. తనకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కృష్ణ కోరుతున్నారు. వర్షాలతో పలు గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లు కూలుతున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రఘుపతి కోరారు.

అన్నారంలో గుర్తు తెలియని యువతి మృతి



మృతురాలు(ఫైల్)

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ దర్గా సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఎస్సై ప్రవీణ్ కథనం ప్రకారం.. అన్నారం దర్గా వద్ద మతి స్థిమితం లేని కొత్తగూడెంకు చెందిన యువతిని ఆమె కుటుంబీకులు ఇటీవల వదిలి వెళ్లారు. ఆమె శుక్రవారం మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సంబంధీకులు సెల్ నంబర్ 8712685028, 8712685242ల్లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

మృతుల కుటుంబాలకు బియ్యం సాయం



దుగ్గొండి : మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన రావులకొలను రాజబాబు, కూచన రమేశ్, చొప్పరి పెద్ద బాబు, నాన బోయిన రాములు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం 2 క్వింటాళ్ల బియ్యం సాయంగా అందజేశారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రచార కార్యదర్శి కూరతోట సురేశ్, నాయకులు ద్యాగం శివాజీ, గోగుల ప్రకాశ్‌రెడ్డి, కొత్తకొండ రవివర్మ, అజ్మీర జయరాంనాయక్, తిరుపతి, ఏకాంబరం, బండారి ప్రకాశ్, ఇజ్జగిరి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

రాయపర్తి : మండలంలోని పానిష్‌తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు భూక్య బాలునాయక్ (49) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు సరికొండ కృష్ణారెడ్డి, పెండ్లి మహేందర్‌రెడ్డి, చిర్ర మల్లయ్య, చెవ్వ కాశీనాథం, భూక్య పరమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సిరిధాన్యాల్లో పోషకాలు అధికం

- పంట కాలం తక్కువ.. లాభం ఎక్కువ
- ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ నాగభూషణం



దుగ్గొండి : ప్రతికూల వాతావరణంలోనూ స్థిరమైన దిగుబడి ఇవ్వడంతోపాటు అధిక పోషక విలువలు కలిగి ఉండడంతో సిరిధాన్యాల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. కొర్రలు తేలికపాటి ఎర్ర నేలల్లో పండించొచ్చు. అండు కొర్రలు, సామలు, అరికెలు, ఊదలు అన్ని రకాల నేలల్లో సాగు చేయొచ్చు. కొర్రలు, అండు కొర్రలు, ఊదలు, సామలు, అరికెల పంట సాగు, వాటిలో పోషకాల లభ్యత వరంగల్ ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నాగభూషణం చెప్పారు.

కొర్రలు..

తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో కొర్రలు పండించవచ్చు. ఖరీఫ్‌లో జూన్ రెండో వారం నుంచి జులై చివరి వారం వరకు విత్తుకోవచ్చు. వరుసల మధ్య 30 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్ల ఎడం ఉండాలి. పంట కాలం 75–80 రోజులు. ఎకరాకు 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. చీడపీడల బాధ చాలా తక్కువ. క్రిమి కీటకాలు ఆశిస్తే సాధారణ పంటలకు పిచికారీ చేసే మందులు పిచికారీ చేస్తే సరిపోతుంది. కొర్రలు తీపి, వగరు రుచులు కలిగి ఉండి మధుమేహ బాధితులకు మంచి ఆహారంగా ఉపయోగపడతాయి. శరీరంలో కొలెస్ట్రాల్ తగ్గిస్తాయి. కొర్రల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికం. పీచు పదార్థం, మాంస కృత్తులు, కాల్షియం, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం, భాస్వరంతోపాటు విటమిన్లు అధికపాళ్లలో ఉంటాయి. చిన్న పిల్లలకు, గర్భిణులకు మంచి ఆహారం. ఉదర సంబంధిత వ్యాధుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

అండు కొర్రలు..

అతి తక్కువ వర్షపాతం ఉన్నా పంట చేతికి వస్తుంది. ఎకరాకు 5–6 క్వింటాళ్ల దిగుబడి లభిస్తుంది. సాళ్ల నడుమ 60 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్లు దూరం ఉండాలి. ఒక్కో దుబ్బుకు 15–20 పిలకలు వస్తాయి. పంట కాలం 85 రోజులు. సస్యరక్షణ, ఎరువుల వినియోగం మామూలుగా ఎర్రజొన్నలా వేస్తే సరిపోతుంది. అండు కొర్రలను 4 గంటలు నానబెట్టిన తర్వాతే వండాలి. జీర్ణాశయ సంబంధిత, ఆర్థరైటిస్, బీపీ, థైరాయిడ్, కంటి, ఊబకాయం, తదితర సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అల్సర్, కేన్సర్ బాధితులకూ మేలైన ఆహారం.



ఊదల పంట



కొర్రల పంట



అండు కొర్రల పంట

సామలు..

అధిక ఉష్ణోగ్రతను, నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. జూన్, జులై నెలల్లో విత్తనాలు వేయాలి. సాళ్ల మధ్య 25, మొక్కల మధ్య 10 సెంటీమీటర్ల చొప్పున ఎడం ఉండాలి. పంట కాలం 80–90 రోజులు. ఎకరాకు 5–6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సస్యరక్షణకు సాధారణ పంటల తరహా చేపట్టాలి. ఇవి రుచికరంగా ఉంటాయి. ఆహారంగా తీసుకుంటే గుండెల్లో మంటగా ఉంటే తగ్గుతుంది. కడుపు ఉబ్బరం వంటి సమస్యలకు ఔషధంగా పని చేస్తుంది. సుఖవ్యాధులు, అతిసారం, అజీర్ణం తగ్గుతాయి. పీచు పదార్థం మలబద్ధకాన్ని నివారిస్తుంది. మైగ్రేన్ సమస్యకు చక్కటి పరిష్కారం. గుండె సమస్య, ఊబకాయం, కీళ్లనొప్పుల బాధితులకు ఉపశమనం లభిస్తుంది.

అరికెలు..

నీటి ఎద్దడిని తట్టుకుంటాయి. పొడి వాతావరణం అనుకూలం. జూన్ రెండో వారం నుంచి జులై చివరి వారం వరకు విత్తుకోవచ్చు. సాళ్ల మధ్య 25, మొక్కల మధ్య 10 సెంటీమీటర్ల ఎడం ఉండాలి. పంట కాలం 95–100 రోజులు. ఎకరాకు 6–8 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అరికెలు తీపి, వగరు, చేదు రుచులతో అధిక పోషకాలు కలిగి ఉంటాయి. విటమిన్లు, ఖనిజాలు అధికం. ఆహారంలో వీటిని చేర్చితే జీర్ణశక్తి పెరుగుతుంది. కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా కాపాడతాయి. వీటిని బొబ్బెరుల, శనిగలతో కలిపి తీసుకుంటే శరీరానికి పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. వాతరోగానికి, కీళ్ల వాతానికి, కంటి నరాల బలానికి మంచి ఆహారం. అరికల పిండి వాపులకు పైపూతగా వినియోగించొచ్చు.

ఊదలు..

వరికి ప్రత్యామ్నాయ పంటగా ఉపకరిస్తుంది. సాళ్ల మధ్య 25, మొక్కల నడుమ 10 సెంటీమీటర్ల ఎడం ఉండాలి. పంట కాలం 90–95 రోజులు. ఎకరాకు 5–8 క్వింటాళ్ల దిగుబడి లభిస్తుంది. సస్యరక్షణ చర్యలు మామూలు పంటల తరహాలోనే చేయాలి. ఇవి రుచికరంగా ఉంటాయి. ఊదలతో తయారు చేసిన ఆహారం బలవర్ధకం. సులభంగా జీర్ణమవుతుంది. ఊదలు వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. చిన్న పేగుల్లో పుండ్లు పడకుండా, పెద్ద పేగులకు కేన్సర్ సోకకుండా కాపాడుతుంది..

పల్లెల్లో పంచాయతీ కార్యదర్శులు కీలకం

- ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పాక శ్రీనివాస్



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్

గీసుకొండ : పల్లెల్లో పంచాయతీ కార్యదర్శులు కీలకమని ఇన్‌చార్జ్ ఎంపీఈఓ పాక శ్రీనివాస్ తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ రియాజుద్దీన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తగా ఉండాలని చెప్పారు. నీటి నిల్వలను గుర్తించాలని, గుర్తించి గుంతలను పూడ్చివేతకు చర్యలు చేపట్టాలని తెలిపారు. వరుస వర్షాల నేపథ్యంలో గ్రామీణ ప్రజలు సమస్యల బారిన పడకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. వర్షాకాలంలో పంచాయతీ కార్యదర్శులు క్రియాశీలకంగా పని చేయాలని కోరారు. సమావేశంలో కార్యాలయ సూపరింటెండెంట్ కమలాకర్, ఏపీఓ చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ శ్రీరాములు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

నర్సంపేట రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించి సత్తాచాటాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు కోరారు. నర్సంపేటలోని పార్టీ మండల కార్యాలయంలో మండల అధ్యక్షుడు తనుగుల అంబేడ్కర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. పేదలను ఆదుకునేలా కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అభివృద్ధి పనులు చేపడుతోందని తెలిపారు. కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, చేపడుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. తద్వారా పార్టీ తరఫున బరిలో నిలిచే అభ్యర్థుల గెలుపునకు బాటలు వేయాలని కోరారు. అనంతరం శ్రీరాములును నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో జిల్లా నాయకులు కుంభం కోమల్‌రెడ్డి, జూలూరు వెంకటేశ్వర్లు, వెల్దండి మార్కండేయ, గాదెగోని అనిల్, మండల ప్రధాన కార్యదర్శి భట్టు మధన్, తాళ్లపెల్లి రాము, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ అముదాల రమేశ్, ఉపాధ్యక్షులు బోయిని సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

లంబాడీల కులగణన జాబితా ప్రకటించాలి

- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు వాసు



సమావేశంలో మాట్లాడుతున్న వాసునాయక్

నర్సంపేట : రాష్ట్రంలోని లంబాడీల కులగణన జాబితాను ప్రకటించాలని లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర నాయకుడు వాసునాయక్ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన డివిజన్ కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. లంబాడీలు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని తెలిపారు. రాజ్యాధికారమే లక్ష్యంగా లంబాడీలు ఎదగాలని చెప్పారు. గోర్ భాషను రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చి లిపి ఏర్పడే దిశగా కేంద్రం చొరవ చూపాలని కోరారు. సేవాలాల్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15న జాతీయ పండుగగా ప్రకటించాలని, ఏజెన్సీ చట్టాలను కాపాడాలని, ఏజెన్సీ గిరిజనులకు నూరు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాల్సి ఉందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 31న హైదరాబాద్‌లో తలపెట్టిన సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జగన్‌నాయక్, డివిజన్ బాధ్యులు ప్రశాంత్‌నాయక్, స్వామినాయక్, శోభనం గవాస్కర్, సురేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు ప్రారంభం

ఆత్మకూరు : స్థానిక పార్వతీదేవి సమేత మహాదేవ స్వామి పంచకూట శివాలయంలో శ్రావణ మాస పూజలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి మహాదేవస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారికి ఒడిబియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు వచ్చునూరు శరత్ శర్మ, శ్రావణ్ శర్మలు మాట్లాడారు. దుతూ శ్రావణమాసం ముగిసే వరకు ప్రత్యేక పూజలు కొనసాగుతాయని చెప్పారు. సోమవారాల్లో స్వామి వారికి ప్రత్యేక రుద్రాభిషేకాలు, శుక్రవారం అమ్మవారికి ఒడిబియ్యం సమర్పణ, తదితర విశేష పూజలతో పాటు లలితా సహస్రనామ పారాయణం, కుంకుమ పూజలు తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. భక్తులు సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఆగస్టు 13న మహాగర్జన సభ

దామెర : ఆగస్టు 13న తలపెట్టిన పింఛన్ మహాగర్జన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న కోరారు. మండల కేంద్రంలో పింఛన్‌దారులతో శుక్రవారం సమావేశం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం ఒంటరి మహిళలకు, వృద్ధులకు, బీడీ కార్మికులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, కండరాల క్షీణత కలిగిన వారికి రూ.15 వేలు చొప్పున పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 13న హైదరాబాద్‌లో మహాగర్జన సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్, వీహెచ్‌పీఎస్ నాయకులు నల్ల రజిత, మహేందర్, వంగ చేరాలు, సరోజన, చిన్నమ్మ, చంటి, బాబు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు 31 వరకు గడువు

నర్సంపేట : డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈనెల 31వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లం నవీన్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ ఉత్తీర్ణులై డిగ్రీలో చేరని విద్యార్థులకు దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) చివరి అవకాశంగా ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించిందని చెప్పారు. ఆగస్టు 3వ తేదీ నాడు సీట్లు కేటాయిస్తామని, 6వ తేదీ వరకు కళాశాలలో చేరాలని తెలిపారు. దోస్త్ నమోదులో ఇబ్బందులు తలెత్తితే కళాశాలలోని సహాయక కేంద్రంలో కోఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచందర్‌ను సంప్రదించాలని సూచించారు. కళాశాలలోని సహాయక కేంద్రంలో దోస్త్ రిజిస్ట్రేషన్ ఉచితమని, విద్యార్థుల ఆధార్ నంబర్ మొబైల్ నంబర్‌కు అనుసంధానం చేసి ఉండాలని, విద్యార్థులు పదో తరగతి మెమోతోపాటు ఇంటర్ రెండో సంవత్సర హాల్ టికెట్ నంబర్, కుల, ఆదాయ, స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో సంప్రదించాలని కోరారు.

ఐక్యపోరాటాలతోనే సమస్యల పరిష్కారం

నర్సంపేట : ఐక్యపోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆబోతు రాజు యాదవ్, జనగాం లక్ష్మయ్య స్పష్టం చేశారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సమాజంలో వికలాంగుల జీవితాలు దయనీయంగా ఉన్నాయని చెప్పారు. దివ్యాంగుల్లో అత్యధికులకు ప్రభుత్వ సదరం కార్డులు లేవని, సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని తెలిపారు. సమస్యల పరిష్కారానికి దశలవారీగా పోరాటాలు నిర్మిస్తామన్నారు. ఈనెల 28న తహసీల్దార్లకు, ఆర్డీఓలకు వినతిపత్రాలు ఇవ్వాలని శ్రేణులకు సూచించారు. దివ్యాంగులందరికీ సంక్షేమ పథకాలు అమలయ్యే దిశగా ప్రభుత్వం పకడ్బందీగా కార్యాచరణ చేపట్టాలని, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం చొరవ చూపాలని, సంక్షేమ పథకాల అమలులో దివ్యాంగులకు ప్రత్యేక కోటా కల్పించాలని, పింఛన్ రూ.6 వేలకు పెంచి అందించాలని డిమాండ్ చేశారు.

మొక్కలు నాటాలి

దామెర : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని మండల ప్రత్యేక అధికారి బాలరాజు కోరారు. మండలంలోని సింగరాజుపల్లి శివారులో వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై జ్యోతి, ఎంపీఓ రంగాచారి, ఏపీఓ శారద, టీఏ సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కళా వైభవం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శాంతికృష్ణ, తదితరులు

పర్వతగిరి : హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆగస్టు 31న కాకతీయ కళా వైభవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పోస్టర్‌ను శాంతికృష్ణ సేవా సమితి నిర్వాహకుడు శాంతికృష్ణ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఎ.పద్మాచారి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



నెక్కొండ : లబ్ధిదారులకు మంజూరు పత్రం అందజేస్తున్న రంజిత్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి

- టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి

నెక్కొండ : ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పత్తిపాకకు చెందిన గంగ్రకోట వెంకన్నకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా శుక్రవారం భూమి పూజ కార్యక్రమానికి రంజిత్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి హాజరై ప్రొసీడింగ్ పత్రాలు అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పాటుపడుతోందని చెప్పారు. దశలవారీగా పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పెండ్యాల హరిప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, ఉపాధ్యక్షుడు పొలిశెట్టి భాను, వర్కింగ్ ప్రెసిడెంట్లు తిరుమల్ చౌహాన్, మాదాటి శ్రీనివాస్, కోశాధికారి సుబ్బారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మహిపాల్‌రెడ్డి, బొమ్మెరబోయిన రమేశ్, విజయ్, నాయకుడు బండి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



రాయపర్తి : ఇంటి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న రవీందర్‌రెడ్డి, నాయకులు

రాయపర్తి : మండల కేంద్రంలో లబ్ధిదారు సమీరా షకీల్‌కు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. పేదల సొంతింటి కలను ప్రభుత్వం నెరవేర్చుతోందని తెలిపారు. సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, వనజారాణి, పట్టణ అధ్యక్షుడు మచ్చ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు పాటించండి

- హౌసింగ్ డివిజనల్ ఇంజనీర్ శశివర్ధన్‌రెడ్డి



లబ్ధిదారుతో మాట్లాడుతున్న డీఈ శశివర్ధన్‌రెడ్డి

దుగ్గొండి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలో నిబంధనలు పాటించాలని హౌసింగ్ శాఖ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) శశిధర్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని బంధంపల్లిలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. లబ్ధిదారులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకే నిర్మాణాలు చేపట్టాలని చెప్పారు. బేస్‌మెంట్ లెవల్‌లో అధికారులు ఫొటో తీసి ప్రభుత్వానికి పంపితే వారం రోజుల్లో లబ్ధిదారుల ఖాతాలో డబ్బు జమ అవుతుందని తెలిపారు. లబ్ధిదారులందరూ సకాలంలో ఇళ్లు నిర్మించాలని సూచించారు. గ్రామానికి మంజూరైన ఇళ్ల సంఖ్య, పనులు ప్రారంభించిన ఇళ్ల వివరాలు, నిర్మాణ దశలను ఆయన పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఇంగోళి రాజేశ్వర్‌రావు, మాజీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, నాయకుడు గాదం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల శుభ్రత తప్పనిసరి

- పీహెచ్‌సీ వైద్యాధికారి నేహా ఫాతిమా



నీటి నిల్వలు తొలగింపజేస్తున్న వైద్యసిబ్బంది

వర్ధన్నపేట : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న క్రమంలో ప్రతిఒక్కరూ తప్పనిసరిగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి నేహా ఫాతిమా కోరారు. మండలంలోని ఎస్‌ఎస్ తండాలో శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరంలో పలువురికి ఆమె పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, విషజ్వరాలు, మధుమేహం, రక్తపోటు, కేన్సర్, తదితర వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి మంగళ, శుక్రవారాలను డ్రై డేగా పాటిస్తూ ఇంటి పరిసరాల్లోని నిల్వ నీటిని తొలగించాలని చెప్పారు. గ్రామాల్లో తిరుగుతూ వ్యాధుల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఇళ్ల పరిసరాల్లో, నీటి తొట్లలో ఉన్న నిల్వ నీటిని తొలగింపజేశారు. కార్యక్రమంలో హెచ్‌వీ స్వర్ణకుమారి, హెచ్‌ఎస్ రాజు, ఏఎన్‌ఎంలు అరుణ, అనిత, ఆశవర్కర్లు భాగ్య, అరుణ, సంధ్య, సరిత పాల్గొన్నారు.

బోధనలో మెళకువలతో విద్యార్థుల ఉన్నతి

- మండల విద్యాధికారి గాయపు లింగారెడ్డి



మాట్లాడుతున్న ఎంఈఓ లింగారెడ్డి

పర్వతగిరి : ఉపాధ్యాయులు బోధనలో మెళకువలు పాటిస్తే విద్యార్థులు ఉన్నతి సాధిస్తారని ఎంఈఓ గాయపు లింగారెడ్డి తెలిపారు. మండలంలోని పర్వతగిరి, కొంకపాక, ఏనుగల్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు శుక్రవారం ముగియగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల అనుభవాలు, అనుసరిస్తున్న బోధన పద్ధతులు పంచుకోవడానికి కాంప్లెక్స్ సమావేశాలు తోడ్పడాలని ఆకాంక్షించారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు అధ్యయనంలో మెరుగుపడేలా, ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు విద్యాబోధన అందించాలని చెప్పారు. కార్యక్రమంలో కొంకపాక, పర్వతగిరి, ఏనుగల్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు భిక్షపతి, పాక రమేశ్ బాబు, నర్సింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యం

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి

ఖానాపురం : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, తదితర అనేక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ అభ్యర్థులు గెలిచేలా ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లాగౌడ్, ఉపేందర్, అచ్యుతం, సాగర్‌రావు, భానుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.